# జస్ట్ ఎ మేటర్ ఆఫ్ రియల్ లవ్

అనూరాధ సర్రాజు



విరిసెన పూవుల సువాసనలతో ఆ సాయం సంధ్యని మనోహరం చేస్తూ ఆ పార్కంతా ఆహ్లాదకరంగా వుంది. చిన్న పిల్లల కేరింతలూ, దూరంగా వినిపించే వాహనాల చప్పళ్ళూ తప్పిస్తే పార్కు వాతావరణం ప్రశాంతంగా, హాయిగా వుంది. ఒకే సిమెంటు బెంచీపై కూర్చుని ఒకరి తనువు మరొకరికి అంటీ అంటనట్లుగా కళ్ళతోనే ప్రేమ సందేశాలు అందించుకుంటున్నారు రవి, సుజాతలు. వాళ్ళ పరిచయానికి వయసు మూణ్ణెళ్ళు. ఇద్దరిదీ ఒకటే అభిప్రాయాలూ, అభిరుచులూ. ఠాగూర్. రాహుల్ సాంకృత్యాయన్, శ్రీశ్రీ, తిలక్, చలం నుండి మాక్సిమ్ గోర్కీలతో మొదలైన వారిద్దరి సాహిత్య గోష్ఠివ్యక్తిగత జీవితాల అవలి వడ్డుకు చేరి ప్రేమ సంకేతమై నిలిచింది.

దూరంగా ఉయ్యాల బల్లపై ఆడుకుంటున్న ఆరేళ్ళ రవి కొడుకు చిన్నీ, మూడేళ్ళ సుజాత కూతురు చంటీలని చూస్తూ రవి అన్నాడు.

"ఆ చిన్నారులే కదూ, మనిద్దరినీ ఇలా దగ్గరికి చేర్చింది. వాళ్ళకి మనం ఏమిచ్చి రుణం తీర్చుకోగలం?"

ఆర్తిగా, ఆరాధనగా రవి కళ్ళలోకి చూసింది సుజాత. రవికి భార్య పోయి ఏడాదిన్నరయింది. యాక్సిడెంట్‌లో సుజాత భర్తపోయి రెండేళ్ళయింది.

"సుజా! నువ్విప్పుడు ఇంటికెళ్ళిపోతే నేను ఒంటరినై ఏమీలేని ఖాళీతనంతో వెళ్ళిపోవాలా!" అతని కళ్ళలోని ఆర్ద్రతకి సుజాత కదిలి..." రేపు మళ్ళీ ఇక్కడే కలుసుకోమూ!" అంది లాలనగా!

ఉయ్యాల బల్లపై ఆడుకుంటూ ఆ ఇద్దరు పిల్లలు అప్పుడే ఆవరించిన చిరుచీకటికి భయపడి పరిగెత్తుకుంటూ రవి, సుజాతల దగ్గరకొచ్చారు. సుజాత కూతురు చంటి రవిని వాటేసుకుని "అంకుల్, నాకో ఫైవ్ స్టార్ చాక్లెట్' కొని పెట్టవూ" అంటూ, మెడ పట్టుకుని గారాలు పోతోంది. సుజాత చంటిని రెక్క పట్టుకుని సున్నితంగా లాగి "తప్పు అంకుల్‌ని అలా విసిగించచ్చా! సారీ చెప్పు" అంది.

చంటిని మళ్ళీ దగ్గరగా లాక్కుని గుండెకి హత్తుకుని "చంటి నీకే కాదు, నాకూ కూతురే! నా పాప మీద పెద్ద చలాయిస్తున్నావే!" రవి అన్నాడు. చిన్నీ సుజాత వొళ్ళో కూర్చుని పొడవాటి ఆమె జడని గట్టిగా లాగి "ఆంటీ, నువ్వు నాకు హెలికాప్టర్ కొనిపెట్టు, వాళ్ళిద్దరూ ఒకటయ్యారుగా, మనం వాళ్ళతో పచ్చి" అన్నాడు. సుజాత జడని అంత గట్టిగా లాగడం చూసినరవి కోపంగా "ఏమిటా వెర్రి చేష్టలు, జడ వదిలెయ్" అన్నాడు. సుజాత చిలిపిగా రవికేసి చూసి "నీ కూతురినైతే అలా గుండెకి హత్తుకున్నావే! చిన్నీ మాత్రం నాకు కొడుకు కాదా!" వాడికి నా మీద ఆ మాత్రం హక్కులేదా!" అంటూ తన జడని వాడి చుట్టూ బిగించి "చిన్ని తండ్రీ! నువ్వే మడిగినా కొని పెడతారా కన్నా" అంది ప్రేమగా. వొళ్ళోని ఆ పిల్లలతో రవి, సుజాతలు ఒకరికొకరు మరింత దగ్గరగా జరగగా రవి, సుజాత చెవిలో గుసగుసగా అన్నాడు. "సుజా! నా ప్రాణమా! నువ్వు లేని నా బ్రతుకు వ్యర్థం". సుజాత సిగ్గుతో అతని భుజంపై తల వాల్చీ వాల్చగానే...

పార్కంతా గందరగోళం... జనాల పరుగులు... కలకలం... దూరంగా దట్టమైన పొగలు...

పరిగెత్తుతున్న ఒకడ్ని ఆపి అడిగేడు రవి ఏం జరిగిందని. "ఓ పార్టీ వాణ్ణి కత్తితో పొడిచారని రెండు పార్టీలూ గొడవ పడుతుంటే పోలీస్ కమీషనర్ ఫైరింగ్ ఆర్డర్స్ ఇచ్చాడు. ఇక్కడో క్షణమున్నా ప్రమాదమే" అంటూ వొగరస్తూ పరిగెత్తాడు వాడు. రవి ఇంకో క్షణం ఆలోచించక తన చేతుల్లోని సుజాత కూతుర్ని కింద వదిలేసి సుజాత వొళ్ళోని తన బాబుని తీసుకుందామనుకునే లోపునే ఈ మాటలన్నీ విన్న సుజాత అప్పటికే జడకి బిగించిన చిన్నీని అర్జెంటుగా విదిలించి, రవి కింద వదిలేసినచంటీని చంకనేసుకుని ఓ వైపూ... సుజాత విదిలించిన తన బాబుని నిజంగా గుండెకి హత్తుకుని రవి మరో వైపూ.... పరుగు లంకించుకున్నారు. ★